# అ-బద్ధం

హైదరాబాదు వెళ్లే రైలు వచ్చి బెజవాడ స్టేషన్‌లో ఆగింది. ఆడవాళ్ల సెకండ్ క్లాస్ పెట్టెలో ఎక్కింది సుశీల. మిగతా పెట్టెలన్నీ క్రిక్కిరిసి వున్నాయి. ఈ ఆడవాళ్ల చిన్న పెట్టె మాత్రం బాగా ఖాళీగా వున్నది. ఒక బెర్త్ మొత్తంలో ఒక లావుపాటామె తన సామాన్లన్నీ సీటు మీదనే పరిచి పెట్టుకుని, కాళ్లు రెండూ సీటు మీదనే విశ్రాంతిగా ముడుచుకుని, కిటికీలో మోచెయ్యి ఆనించుకుని, తాపీగా బయటకు చూస్తూ కూర్చుని వున్నది. ఎదుటి బెర్త్‌లో సుశీల తన హోల్డాలు పరిచి బాబును పడుకోబెట్టి జుత్తు సర్దుకుని కూర్చున్నది. రాత్రంతా జాగరణ చెయ్యకుండా హాయిగా పడుకోవటానికి చోటు దొరికినందుకు సంతోషించింది.

రైలు బయల్దేరాక ఎదుటి సీట్లో ఆమెను "ఎక్కడికి వెళ్తున్నారు?" అని ప్రశ్నించింది.

"ఖమ్మం" అన్నదామె.

ఆమె దిగి వెళ్లిపోతే పెట్టె మొత్తానికి తానొక్కదాన్నే అయిపోతానని తోచగానే సుశీలకు అమ్మ చెప్పిన జాగ్రత్తలన్నీ గుర్తుకొచ్చినై. 'ఆడవాళ్ల పెట్టెలో ఎక్కవద్దు. కష్టమైనా మగవాళ్లున్న పెట్టెలో ఎక్కడమే మంచిది. ఒంటరిగా అసలు వుండరాదు' అని ప్రతిసారీ చెప్పినట్లే గట్టిగా చెప్పింది అమ్మ. 'జాగ్రత్తలు చెప్పడమైతే చెప్పారుగాని ఎవరైనా బెజవాడ వరకూ వచ్చి రైలెక్కించలేకపోయారు! పనివాణ్ణి పంపినా సరిపోయి వుండేది. వాళ్ల కోపతాపాలేగాని నా సంగతి పట్టలేదు' అని విసుక్కుంది సుశీల. 'వచ్చి పది రోజులు కాలేదు. ఇంత దూరం వచ్చి అంతలోనే వెళ్లకపోతేనేం? ఇంకో పది రోజులుండి సంక్రాంతి వెళ్లాక వెళ్దువు. మీ ఆయన్ని పండక్కి రమ్మని వ్రాయి. ఇద్దరూ కలిసి వెళ్దురుగాని. పిల్లవాడితో ఒక్కదానివీ వెళ్లలేవు' అన్నారు అమ్మా నాన్నా. అసలే అక్కడ తగవులాడి వచ్చి వుండటాన, ఆయన ఘట్టిగా రమ్మని వ్రాసినప్పుడు వెళ్లకపోతే బాగుండదనే వుద్దేశంతో తానే మొండిపట్టు పట్టింది. రైలెక్కించడానికి అమ్మా వాళ్లకు వీలు కాలేదు. 'ఇంత చదువుకొని ఎన్నో ప్రయాణాలు చేసినదాన్ని. బాబు వున్నాడనేగాని లేకుంటే నాకు

యిదంతా ఒక లెఖ్ఖా?' అనుకుని బయల్దేరింది సుశీల ఒంటరిగానే.

"పిల్లాడికెన్నో ఏడూ?" దీర్ఘం తీస్తూ అడిగింది ఎదుటి సీట్లోని ఆవిడ.

"మూడు నిండింది"

ఎవరడిగినా అయిదో సంవత్సరమని చెప్పమనీ, లేకుంటే దిష్టి తగులుతుందనీ తల్లి చెప్పిన విషయం గుర్తున్నా, అబద్ధం చెప్పడానికి అలవాటూ, యిష్టమూ లేక నిజమే చెప్పింది సుశీల. ఒకసారి ఎవరితోనో పిల్లాడికి అయిదు వెళ్లిందని చెప్పింది సుశీల తల్లి. పొడుగు పిల్లాడు కావటాన చూడటానికి కాస్త నదురుగా వున్నా మొహంలో పసితనం కన్పిస్తూనే వుంది. అవతలివాళ్లు నిజం వూహించి 'ఈవిడ అబద్ధం చెబుతున్నది' అనుకుంటారేమోనన్న భయం వున్నది సుశీలకు. అబద్ధాలు చెప్పేవాళ్లంటే సుశీలకు అసహ్యం.

'టక్ టక్'మన్న శబ్దంతో పరధ్యానం నుండి బయటపడింది సుశీల. టికెట్ కలెక్టర్ వచ్చి పెన్సిల్‌తో పై బెర్త్ మీద టకటక శబ్దం చేస్తున్నాడు. "టికెట్స్" అన్నాడు. సుశీల పర్స్ తీసి తన టికెట్ చూపించింది. "పిల్లవాడికి?" అన్నాడు. "వాడికి మూడేళ్లే" అన్నది సుశీల సగం విసుగూ సగం గర్వం కలిసిన గొంతుతో నిర్లక్ష్యంగా. "మూడు నిండిందా?" అన్నాడు టీ.సీ. "అవును" అన్నది సుశీల. టీ.సీ. ముఖంలో చిన్న నవ్వు కన్పించింది. దొంగను పట్టుకున్న పోలీసు దర్పమూ, అజ్ఞానుల యెడల తెలిసినవాళ్లు చూపే పెద్దరికపు ఠీవీ ఒలకబోస్తూ "చూశారా మరి... మూడు నిండితే అర టికెట్ కొనాల్సిందే...రూల్స్... ఇక్కడ ఫరవాలేదుగాని, పైకి పోతే అక్కడ చెకింగ్ గట్టిగా వుంటుంది. పిల్లవాడి వయస్సడిగితే మూడో సంవత్సరం అని చెప్పండి" అని సలహా యిచ్చాడు ఉదారంగా. కాస్త పెద్ద పిల్లలకు అర టికెట్ కొనాలని తెలిసినా మరీ మూడేళ్ల పసివాళ్లకే కొనాలన్న విషయం బాగా ప్రకటించనందుకు రైల్వే వాళ్ల మీదా, తెలుసుకోనందుకు తన మీదా చికాకు కల్గింది సుశీలకు. కాని ఈ విషయంలో టీ.సీ. నానా హంగామా చేసి ఫైన్ వెయ్యనందుకు చాల సంతోషించింది. "అలానేనండి" అంటూ తల వూపింది కృతజ్ఞతతో. ఎదుటి సీటామె టికెట్ చూసి వెళ్లిపోయాడు టీ.సి.

ఆమె లేచి సామాన్లు సర్దుకోవటం ప్రారంభించింది. "మీరు దిగిపోతే నేను ఒక్కర్తెనే అయిపోతాను... వేరెవరైనా ఎక్కుతారో, లేదో" అన్నది సుశీల. "ఎవరూ రాకుంటే మగవాళ్ల పెట్టెకు మార్చుకోండి. కాలం మంచిదికాదు" అన్నదామె. ఆమె దిగిపోయాక డోర్నకల్ వరకూ ధైర్యం చిక్కబట్టుకుని తలుపులూ, కిటికీలూ వెయ్యికళ్లతో చూస్తూ కూర్చుంది సుశీల. అక్కడా క్రొత్తవాళ్లెవరూ ఎక్కలేదు. అప్పుడు కూలీని పిలిచి సామాన్లతో మగవాళ్ల పెట్టెలోనికి మార్చుకున్నది.

మగవాళ్ల పెట్టెలో రద్దీ జాస్తిగా వున్నది. నిద్ర విషయంగా ఆశ వదిలేసినవాళ్లలా అందరూ గుంపులుగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఒక సీట్లో ముగ్గురు మగవాళ్ల ప్రక్కగా కిటికీ దగ్గరగా కొంచెం చోటు దొరికింది సుశీలకు. వాళ్లకూ తనకూ మధ్యగా బాబును కూర్చోబెట్టి కిటికీ ప్రక్కగా కూర్చున్నది. బాబుకు నిద్ర ముంచుకొస్తున్నది. సుశీలకు ఏం చెయ్యాలో తోచలేదు. ఇంతలో బాబు ప్రక్కనున్నతను "ఎక్కడన్నా ఖాళీ వున్నదేమో చూసొస్తాను" అంటూ ప్లాట్‌ఫారం మీదికి దిగివెళ్లాడు. రెండు నిముషాల్లో తిరిగివచ్చి "ప్రక్కనే ఆడవాళ్ల పెట్టె ఖాళీగా ఉన్నది. ఎవరైనా వచ్చి దింపేవరకూ అక్కడ హాయిగా పడుకోవచ్చు" అని ప్రక్కనున్నాయనతో చెప్పాడు. ఇద్దరూ చేతి సంచులు పుచ్చుకొని దిగి వెళ్లిపోయారు. ఒక్కక్షణం వృథా చెయ్యకుండా ఖాళీ అయినచోట తన హోల్డాలు పరిచేసింది సుశీల. సీట్లో ఆచివర మిగిలిపోయినతను కొంచెం కోపంగా చూసి ముఖం తిప్పేసుకున్నాడు. మాటల్లో మునిగివున్న వాళ్లు కూడా తలలు త్రిప్పి పరికించి చూశారు. 'ఆడవాళ్ల అఘాయిత్యం యిల్లా వుంది!' అన్న భావం అంతటా కన్పించింది సుశీలకు. అయినా లెక్క చెయ్యనట్లు నిద్రతో తూలుతున్న బాబును సుఖంగా పడుకోబెట్టి ప్రక్కన కూర్చొని వాడికి విసరటం ప్రారంభించింది. బాబు నిద్రపోయాడు. సీట్లో ఆ చివర్న కూర్చున్నతను నిద్ర ఆపుకోలేక కునికిపాట్లు పడుతూ, వుండుండి తల విసురుగా ముందుకు వాలిపోతుంటే సర్దుకుంటున్నాడు. ఎదుటి సీట్లో వాళ్లు కిటికీలో తలపెట్టుకొని ఒకరూ, ఒళ్లో వున్న చేతిసంచీ మీద ముఖం ఆనించి ఒకరూ కునుకు తీస్తుంటే, మూడో ఆయన రైలుపెట్టె గుడ్డి వెల్తురులో ఏదో పుస్తకం చదవను ప్రయత్నిస్తున్నాడు. కాసేపు చూసి, బాబుని కాస్త ఒత్తిగించి ప్రక్కనే పడుకుంది సుశీల. రైలు కుదుపుకు హాయిగా నిద్ర పట్టేసింది.

నిద్రలోని నిశ్శబ్దంలో నుంచీ ఏదో గందరగోళంలోనికి మెలకువ వచ్చినట్లయింది. బయటి చీకటీ, పెట్టెలోని గుడ్డిలైట్లూ అలానే వున్నై. రైలు ఆగి వున్నది. 'కాజీపేట... కాజీపేట' అంటున్నారు. అవతలివైపున ప్లాట్‌ఫారం మీద మసక వెల్తురులో మనుషులు నడుస్తున్నారు యిటూ అటూ. 'గరమ్ చాయ్... చాయ్... చాయ్' అన్న కేకలు విరామం లేకుండా విన్పిస్తున్నవి. 'హాట్ చాయ్... వన్‌పాట్...' ముందున్న చిన్న సీట్లోంచి ఎవరో ఆర్డరిచ్చారు.

పెట్టెలోని మనుషులందరూ మాట్లాడుతున్నట్లుగా సందడిగా వుంది. సుశీల లేచి కూర్చున్నది. తమ సీట్లోని ఆ చివరాయన సంచీ పట్టుకుని కునికిపాట్లు పడుతూనే వున్నాడు. ఎదుటి సీట్లోని వాళ్లు నిద్రాభారంతో ఎర్రబడ్డ కళ్లను మూస్తూ తెరుస్తూ అప్పుడప్పుడు ఒక్కోమాట మాట్లాడుకుంటున్నారు నెమ్మదిగా.

ప్లాట్‌ఫారం వైపుగా వున్న పొడుగాటి పై బెర్త్ మీద హోల్డాలులు పరుచుకుని

వున్నవాళ్లు యిద్దరు పెద్దగా మాట్లాడుతున్నారు. సంభాషణను బట్టి యిద్దరూ డాక్టర్లని గ్రహించింది సుశీల. 'కాలేజ్‌లో నీ Performanceని బట్టి ఎంతో పైకి వస్తావనుకున్నాం. పల్లెటూరి డాక్టరుగా మిగిలిపోతావనుకోలేదు. సర్జరీ ప్రొఫెసర్ నిన్ను చాలా మెచ్చుకునేవారు!' అన్నాడు చామనచాయలో వుండి కళ్లజోడు పెట్టుకుని సన్నగా పొడుగ్గా వున్నాయన. మంచితనమూ, జీవితంలో యిహ తెలుసుకోదగ్గదేమీ లేదన్నట్టి నిర్లిప్తతా కన్పిస్తున్నవి అతని మొహంలో. జుట్టు సగం తెల్లబడిపోయింది. అతని బట్టలు ఇప్పుడే మంచి చాకలి తెచ్చి యిచ్చినవాటిలా మెరుస్తున్నవి. మనిషి శుభ్రంగా వున్నాడు. పల్లెటూరి డాక్టరు కొంచెం బొద్దుగా, పుష్టిగా వున్నాడు. శరీరం తెల్లగా వుండి, లైటు వెల్తురులో మెరుస్తున్నది. బట్టలు తెల్లగా వున్నా నలిగి వున్నాయి. సోమరిగా దిండు మీదకు సగం వాలి సిగరెట్ పొగ వదిలి పెద్దగా నవ్వాడు మిత్రుడి మాటలకు. 'నాకేం లోటు వచ్చిందంటావ్? సుఖంగా వున్నాను... మూణ్ణాళ్ల ముచ్చటలాంటి బ్రతుకును ambitionలో మసిచేసుకుంటూ సరదా లేకుండా బ్రతకాలని యిష్టం లేదు' అన్నాడు ఆప్యాయంగా స్నేహితుణ్ణి చూస్తూ.

పొడుగాటి క్రింద బెర్త్‌లో అవతలి సగం ఆక్రమిస్తున్న ముగ్గురు మనుషులు చర్చలో మునిగి వున్నారు. ఈ చర్చ నిద్రను జయించే ప్రయత్నమే అయితే అది నెరవేరినట్లే... అప్పుడప్పుడు ఆవలింతలు రావడం మినహాగా వాళ్ల మాటల్లోగానీ, మొహాల్లోగాని నిద్ర తాలూకు ఛాయలేమీ లేవు. 'గురువుగారికి నియమనిష్ఠలూ, ఆచారం మీద పట్టింపూ వున్నాయి. వర్ణాశ్రమ ధర్మాలు ప్రధానం అంటారు...' అన్నాడు పొడుగ్గా, సన్నగా, తెల్లగా వున్నాయన కనుబొమలెగరేస్తూ. కాషాయబట్టలు ధరించిన ముసలాయన క్రిందికి చూస్తూ 'నారాయణ... నారాయణ...' అని తలూపాడు. వాళ్ల మాటలు శ్రద్ధగా వింటున్న మూడో అతను 'మా వూరి ఆశ్రమంలో అమ్మగారున్నారు. ఆమెకు యీ ఆచారాల పట్టింపుల్లేవు. కులాల పట్టింపూ లేదు. అక్కడ అందరికీ ఏకపంక్తి భోజనమే...' అన్నాడు. అతను యింకా ఏమో చెప్పబోతూ వుండగా మిగతా యిద్దరూ సాభిప్రాయంగా ఒకరినొకరు చూసుకుని నవ్వుకున్నారు. అనాసక్తతను వ్యక్తపరుస్తూ పొడుగాటాయన ఆవులించాడు. మూడో అతను యిది గమనించి 'ఆమె సాక్షాత్తూ ఆదిశక్తి అంటున్నారు...' అని ముగించి కాళ్లు సర్దుకున్నాడు. అప్పుడు అతని కాళ్లను గమనించింది సుశీల. ఒక కాలు రెండో కాలుకి రెట్టింపు లావులో వున్నది. లావాటి కాలు మీద గుడ్డ కప్పుకుని వున్నాడు. బోదకాలైతే పాదం వరకో, మోకాలు వరకో వుబ్బటం చూసింది కాని యిలాగ కాలు కాలంతా ఒకే లావున వుబ్బి వుండటం చూడలేదు! సుశీలకు అతని మీద జాలి కలిగింది. 'పాపం, ఆ కాలు ఎలా మోస్తున్నాడో' అనుకున్నది. వాళ్లు మళ్లీ గురువుగారి

కబుర్లలో పడిపోగా లావు కాలతను వాళ్ల మాటలను శ్రద్ధగా వింటున్నాడు...

అదే పొడుగు సీట్లో ఇంకోవైపున ఇద్దరు స్టూడెంట్సు కాబోలు సినిమాల గురించి మాట్లాడుతున్నారు. ముందుగా వున్న చిన్న సీట్లో ఒకతను నిద్రలేక ఎర్రబడ్డ కళ్లతో దీనంగా వున్నాడు. చాలీచాలని చోటులో యిరుక్కుని కూర్చున్నాడు. మిగతా చోటంతా హోల్డాలు పరుచుకుని దాని మీద సుఖంగా కూర్చొని వున్నతను తన ముందర షేవింగు సామాన్లు పరిచిపెట్టుకొని, మొహం నిండా దట్టంగా సబ్బు పట్టించి, తెల్లటి సబ్బు నురగలోనుంచీ మాట్లాడుతున్నాడు. నలభై ఏళ్ల పై వయసులో లావుగా, నల్లగా ఉన్నాడు. హాయిగా నిద్రపోయి లేచినట్లున్నాడు. నిద్ర లేక బాధపడుతున్న మనిషితో వుత్సాహంగా, పెద్దగా వెయిన్‌కోట్ దొరగారి గురించి చెబుతున్నాడు. మాటల్లో యితని పేరు జేకబ్ అని తెలిసింది. 'క్రైస్తవ మత ప్రచారకుడిలా వున్నాడు' అనుకున్నది సుశీల. రెండో అతను నిద్రపోనూ లేక, పోకుండా వుండనూ లేక సతమతమౌతూ జేకబ్ చెబుతున్నదానికి బాధగా తలూపుతున్నాడు.

ఇంతలో బయటనుండీ 'టీ, సర్' అన్నారు. పొడుగు సీట్లోని స్టూడెంటు 'ఇల్లా తేవోయ్!' అన్నాడు. జేకబ్ ఆత్రంగా 'నేను ఆర్డరిచ్చింది... Bring it here.... is it hot? అన్నాడు. 'Yes, Sir' అంటూ బేరర్ టీ ట్రే తెచ్చి అతని ముందు పెట్టాడు.

జేకబ్ మాటలూ, చేష్టలూ, రూపమూ చూస్తుంటే సుశీలకు చీకాకు పుట్టింది. 'ఆ సబ్బు నురగలో నుంచే ఆ పాచినోటితోనే త్రాగేస్తాడు కాబోలు!' అనుకుంది చీకాగ్గా... అల్లానే ఒకచేత్తో రేజర్ పట్టుకుని రెండో చేతిలోని కప్పులోని టీని చప్పరిస్తూ నిద్ర లేకుండా యిరుక్కుని కూర్చున్నతనితో అమెరికాలోని లూథరన్ మిషన్ చేస్తున్న సేవలను తనే చేస్తున్నట్లుగా చెప్తున్నాడు జేకబ్.

★★★

సుశీలకు విసుగేసి కిటికీలోంచే బయటకు చూస్తూ కూర్చుంది. హైదరాబాద్ దగ్గరకు వస్తున్నదంటే మనసంతా కలవరమైపోయింది. ఎంత పోట్లాడి, ఎంత మొండిగా వచ్చేసింది తాను! అత్తగారిని స్వగ్రామానికి పంపించేస్తే కాని యింట్లో వుండనని పంతం పట్టి పుట్టింటికి వచ్చేసింది. తరువాత ఏం జరిగిందోగాని ఆమె వెళ్లిపోయిందని వ్రాశాకనే తాను తిరిగి బయల్దేరింది! భర్త స్టేషన్‌కు వస్తే ముఖం ఎలా చూసేదా అని మధనపడసాగింది. అత్తగారికి యీ కొడుకు తప్పించి వేరే సంతానంగాని, కావల్సినవాళ్లుగాని లేరు. అలాగని కొంచెం సర్దుకు పోవచ్చునా? అల్లాంటిదేమీ లేదు. ఆమెకెంత తోస్తే అంతే. మంచీ చెడ్డా, నిజం అబద్ధం, నీతీ నిజాయితీలాంటి వేమీ లేవామెకు. తాననుకున్నది జరగటం తప్పించి మరే నియమాలూ ఆమెకు లేవు. అబద్ధాలు మంచినీళ్ల

ప్రవాహంలా దొర్లుకొస్తాయి ఆమె నోట్లోంచి. కాన్వెంటు వాతావరణంలో క్రమశిక్షణలో నిజంలో నిజాయితీలో పెరిగిన సుశీలకు యిది ఏమాత్రం సరిపడదు. సుశీలకు మంచీ చెడూ వేరువేరుగా, నిజమూ అబద్ధమూ స్పష్టంగా వున్నవి. అదంతా ఆమె 'తీరు' అనుకోలేకపోయింది...

ప్రక్కింటి సుందరమ్మగారి పాలమనిషి మంచిది. మిగిలిపోయిన పాలన్నీ రోజూ వూరికే ఆమెకు 'కొసరు' పోసేసి వెళ్తుంది. అది సుశీల అత్తగారికి సహించరాని విషయమైంది. ఒకనాడు ఆ పాలమనిషిని చాటుకు పిలిచి 'నీకు తాంబూలానికి రోజూ ఒక అణా యిస్తూ వుంటానుగాని మిగిలిపోయిన పాలు మాకు పోసేసి వెళ్తూ వుండు' అనడిగింది. ఆ విషయం తెలిసి సుందరమ్మగారు సుశీలకు ఫిర్యాదు చేసింది... ఇలాగ ప్రారంభమైంది అత్తాకోడళ్ల మధ్య కలత. ఇదేమని అడిగితే అలిగి పడుకుంటుందిగాని తన తప్పు తెలుసుకోదు, బుద్ధి మార్చుకోదు... సుశీల స్నేహితులతో 'మాకు వందెకరాల మాగాణి వున్నద'నీ, 'లంకంత యిల్లు వున్నద'నీ చెప్పింది. అసలు విషయం ముందుగానే సుశీల ద్వారా విని వున్నవాళ్లు చాటుగా నవ్వుకోవడం, ఆమె చేత మరిన్ని అబద్ధాలు చెప్పించాలని ప్రయత్నించడం సుశీల గమనించింది.

బట్టలు చించుకొస్తున్నదని చాకలి మీద అత్తగారికి కోపం వున్నది. దాని మాన్పించి వేరే చాకలిని పెట్టమని కొడుకుతో చెప్పింది. చాకళ్లందరూ అలానే వున్నారనీ, మార్చినందువలన కలిగే ప్రయోజనం ఏమీ లేదనీ కొడుకు చెప్పడం ఆమెకు నచ్చలేదు... అసలే ఆలస్యంగా బట్టలు తెచ్చిన చాకలిని 'పద్దు కనపడలేదు, రేపు రమ్మని' పంపించి వేసి, కొడుకు యింటికి రాగానే 'ఆ పాడు చాకలి యింకా బట్టలు తేలేదురా... మరీ యింత అన్యాయమైపోతే ఎలా?... వేరే చాకలిని చూసుకుంటేగాని కుదరదు' అంటూ సాధింపు ప్రారంభించింది. ఇదంతా గమనిస్తూనే వున్న సుశీల అసహ్యించుకొని భర్తకు నిజం చెప్తే 'ఆవిడంతే' అని నవ్వి వూరుకున్నాడు.

ఒకనాడు సుందరమ్మగారు తనది పెద్ద స్టీలుగిన్నె కనబడటం లేదని చాల వెతుక్కున్నారు. అత్తగారు తీరుబడిగా బయటే కూర్చుని చూస్తూ 'ఇంట్లోనే ఏ మూలో వుంటుంది. సరిగ్గా చూసుకోండి' అన్నది కూడానూ. రెండు రోజుల తర్వాత సుశీల చాకలికి బట్టలు వెయ్యడానికి బాత్‌రూంలోకి వెళ్లి చూస్తే అక్కడ బట్టల క్రింద వున్నాది ఆ స్టీలుగిన్నె. సుశీలకు చాల కోపం వచ్చింది. 'ఆ గిన్నె మన వాకిట్లో పడి వున్నది. అంత అశ్రద్ధ అయితే ఎలాగంట? రెండు రోజులు వెతుక్కుంటే బుద్ధి వస్తుందని దాచేనులే' అన్నది అత్తగారు. దాని మీదట రభస అయి, ఆమెను స్వగ్రామం పంపించేస్తేగాని యిక్కడ వుండలేననీ, యీ అబద్ధం, కుత్సితం భరించలేననీ మొండికెత్తింది సుశీల.

'ఎలాగో మనం సర్దుకోవాలిగాని ఆమెను పొమ్మంటే ఎక్కడికి పోతుంది? కోరుకున్నట్లుగా లేదని ముక్కు కోసేసుకుంటారా? మన బాబుకే అబద్ధాలు అబ్బితే ఏం చేస్తావ్?' అన్నాడు భర్త. 'నా బిడ్డ అలాంటివాడుగా ఎన్నటికీ కాడు!' అన్నది సుశీల. 'మన మంచి కోరేవాళ్లు... మనల్ని కావాలనుకునే వాళ్లు... మనల్ని అభిమానించేవాళ్లు... ఆత్మీయులు... యింకెవరూ లేరని గుర్తుపెట్టుకో. ఆమెను వెళ్లమని నేను చెప్పను' అన్నాడు భర్త. వీళ్ల వాదనంతా విన్నదో లేదోగాని 'వంటయింది, భోజనానికి రండి' అని పిలవొచ్చింది ఆమె... ఆమెకు కొడుకన్నా, మనుమడన్నా ప్రాణమని సుశీలకూ తెలుసు. కాని ఒక పద్ధంటూ లేని అబద్ధాలూ, అల్పబుద్ధీ సుశీల భరించలేకపోయింది. ఆ పంతంతోనే పుట్టింటికి వచ్చేసింది... ఇప్పటికీ ఎంత ఆలోచించినా సుశీలకు తన ప్రవర్తనలో తప్పు తోచడం లేదు. అయినా యిలా జరగవలసి వచ్చినందుకు చికాగ్గా మాత్రం వున్నది...

★★★

రైలు వేగంగా పరుగెడుతోంది. జేకబ్ షేవ్ చేసుకోవడం పూర్తయిపోయింది. నిద్ర లేక బాధపడుతున్న మనిషితో బైరాగులను గురించీ, దొంగ సన్యాసులను గురించీ మాట్లాడుతున్నాడు పెద్దగా. 'ఒక దినం నేను ఎక్కిన కంపార్ట్‌మెంట్‌లో నలుగురు సాధువులు ఎక్కారు. వాళ్లు ఏదో గొప్ప వేదాంత చర్చలు చేస్తున్నారు. ఆత్మజ్ఞానం అంటూ మాట్లాడుతున్నారు. ఇంతలో టీ.సీ. వచ్చాడు. టీ.సీని చూడగానే వేదాంతం, ఆత్మ జ్ఞానం ఎక్కడికి పోయాయో మరి, నేల చూపులు చూస్తూ నోర్లు మూసుకున్నారున్నారు. బైరాగి వాళ్ల దొంగ వేదాంతం అందరికీ తెలిసిన విషయమేగదా... దరిదాపుల్లో ఊరు లేనచోట రైలాపి వాళ్లను దించేశాడు టీ.సీ. ప్రక్క స్టేషన్‌లోనైనా దింపమని బ్రతిమలాడారు బైరాగులు. మళ్లీ మాట్లాడితే గంజాయితో సహా కొట్లో తోయిస్తానన్నాడు టీ.సీ.' అంటూ పెద్దగా నవ్వాడు. హిందూ మతం మీద క్రిస్టియానిటీ ఆధిక్యత నిరూపించినట్లున్నది అతని ధోరణి!

జేకబ్ మాటలు విన్నట్లూ, విననట్లూ కాకుండా అందరూ తగ్గుస్వరాల్లో నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. అతను సబ్బు నురగలో నుంచీ కాఫీతో పాటుగా నోట్లోని పాచినంతటినీ మింగాడని గుర్తుతెచ్చుకుంది సుశీల అసహ్యించుకుంటూ. తన ఆచారంలోని మంచి గ్రహించలేనివాడు - ఇతరులదంతా గొప్పని భ్రమించేవాడు - రాజు వేషం వేసుకున్న వీధి భాగవతుడు తానే రాజుననుకున్నట్లుగా ప్రవర్తించేవాడు - నల్లదొర! ఆలోచించినకొద్దీ అతని మీద చాల కోపం వచ్చింది. ఇతర్లలో తప్పులెన్నే అధికారం యితనికెక్కడిదీ అనుకున్నది.

జేకబ్ తన తెలివికి తానే మురిసిపోతూన్నట్లు ద్విగుణీకృతోత్సాహంతో "అసలు

యీ దేశంలో అంతా మోసమే... ఒకవైపున దొంగ సన్యాసులు, యింకోప్రక్కన దొంగ బ్రామ్మలూ, దొంగ మంత్రాలూ!" అన్నాడు. చుట్టూ చూశాడు. ఎవరూ మాట్లాడలేదు. నవ్వేనూ లేదు. అందరూ మాటలు మానేసి చూస్తున్నారు. రైలు రొద తప్పించి మరే శబ్దం లేదు. కనీసం ఆ వేదాంత చర్చలు చేసేవాళ్లయినా అభ్యంతరం చెప్తారేమోనని చూసింది సుశీల. ఇహ వూరుకోలేకపోయింది.

"ఇందాకట్నుంచీ చూస్తున్నాను. సాధువులు, సన్యాసులు, దొంగ బ్రాహ్మలు అంటూ వూరికే మాట్లాడుతున్నారు. సాధువులూ, సన్యాసులూ అందరూ మోసగాళ్లనీ, వాళ్లతో పాటు వాళ్లు మాట్లాడే వేదాంతమూ పనికిమాలినదనీ, మంత్రాలు బూటకాలనీ అంటున్నారా?... నిజమంటే ఏమిటో అబద్ధమంటే ఏమిటో మీకు తెలుసా? నాకు తెలుసు. మీ కాన్వెంటుల్లో వుండే వాళ్లంతా వున్నత గుణాలు కలవాళ్లేమీ కాదు! Judge not others lest ye be judged..." అన్నది పెద్దగా.

జేకబ్ మాట్లాడలేదు. సుశీల వైపు చూడను కూడా లేదు. ప్రక్కనున్న మనిషికేసి చూసి నవ్వాడు కనుబొమలు ఎగరేస్తూ.

సుశీలకు చాల కోపం వచ్చింది. ఉద్రేకంతో ఒణుకుతున్న గొంతుతో "అతి పవిత్రమైన మీ కాన్వెంట్లను నేనెరుగుదును. అబద్ధాలూ, కుత్సితాలూ అక్కడా వున్నయ్. సిస్టర్లమంటూ వేషం వేసుకోగానే పవిత్రులుగారు. బుద్ధులేమీ మారవు. వాళ్లలాగే యీ బైరాగులూ..." అంటూ అరిచింది.

ఈసారి కూడా జేకబ్ సమాధానమివ్వలేదు. ఈ మాటలు లెక్క చెయ్యనట్లుగా ప్రక్కనున్నతనితో చిన్నగా కబుర్లు ప్రారంభించాడు.

సుశీలకు అవమానంతో మొహం ఎర్రబడింది. ఇంకేం చెయ్యాలో తోచలేదు. పెట్టెలో అందరూ మాటలు మానేసి శ్రద్ధగా సుశీల మాటలు విన్నారు. అందరూ తననే బలపరుస్తున్నట్లుగా, తన వైపు సానుభూతి కలిగివున్నట్లుగా తోచింది సుశీలకు. 'అసలు నేను ఈ మనిషితో వాదించి వుండకూడదు. ప్రచారం చేసేవాళ్లు low types' అనుకున్నది. తాను ఎక్కువగా గౌరవించి ఇష్టపడిన సిస్టర్స్ జ్ఞాపకం వచ్చి మనస్సు చివుక్కుమన్నది, తప్పు చేసిన భావనతో. తన మాటలు అబద్ధాలుగా తనకే స్ఫురించాయి... కాని అదంతా ప్రక్కకు నెట్టింది. 'సిస్టర్స్‌గా వుండీ వీళ్ల క్రోధ, లోభమాత్సర్యాలు ఒదల్లేదు' అని తాను ద్వేషించిన కొందరిని మాత్రం దృష్టిలో పెట్టుకున్నది. మనసులో కొరత వున్నా కోపంలో తన వాదనను సమర్థించుకోవడానికిగాను సగం నిజం మీదే ఆధారపడి మాట్లాడింది! నిజం, అబద్ధం అంత స్పష్టంగా తెలియలేదిప్పుడు.

టీ.సీ. ఆ ప్రక్కనుండీ టికెట్లు చూసుకుంటూ వస్తున్నాడు. ఈ వాదనల మధ్యలో

బాబు ఎప్పుడో లేచి కూర్చున్నాడు. "మనూరు ఏదమ్మా...? నాన్నేడీ" అన్నాడు. వాడికి మాటలు త్వరగా రావటమే కాకుండా స్పష్టంగా కూడా వస్తున్నాయి. టీ.సీ. ఒచ్చాడు. "మనూరు దగ్గరకొచ్చేసింది" అని కొడుకుతో చెప్తూ పర్సులోంచీ టికెట్ తీసి చూపించింది. "అబ్బాయికెన్నేళ్లు?" అన్నాడు. బెజవాడ దగ్గర టీ.సీ. చెప్పిన సలహా జ్ఞాపకం వచ్చింది. "మూడో ఏడు" అన్నది గభాల్న. "కాదు. ఆ అబ్బాయి అయిదేళ్లవాడిలా కన్పిస్తున్నాడు.... ఫైన్‌తో టికెట్ తీసుకోవాలి" అన్నాడు టీ.సీ. ఖచ్చితంగా. "అబ్బాయికి మూడోఏడని చెప్పలేదూ..." అన్నది సుశీల తల ప్రక్కకి తిప్పేసుకుని కిటికీ బయటకు చూస్తూ.

తానే అబద్ధం చెబుతున్నదా!.

పెట్టెలో వుండేవాళ్లంతా తననే చూస్తున్నట్లనిపించింది. టికెట్ తీసుకోకుండా రైలెక్కిన సాధువులు మనసులో మెదిలారు. జేకబ్ నవ్వుకుంటూ వుంటాడు. ఇంత అవమానకరమైన పరిస్థితిలో ఎలా చిక్కుకున్నాను? అనుకుంది ఆశ్చర్యంగా, అవమానంతో క్రుంగిపోతూ. తాను అబద్ధం చెబుతున్నట్లు కూడా తెలియలేదు! మనసు అల్లకల్లోలం అయింది.

టీ.సీ. గట్టిగా మాట్లాడుతున్నాడు. "మీరు తల్లి గనుక ఏం చెప్పినా చెల్లుతుంది. కాని నిజం ఏమిటో మీ మనసుకు తెలుసు. ఆ అబ్బాయికి అయిదేళ్లు. మీరు కాదంటే నేనేం చెప్పగలను?" ఒక్కో మాట ఒక్కో సమ్మెటపోటులా వుంది. ప్రపంచమంతా ఒకటై 'నీవు అబద్ధం చెప్తున్నావు!' అని నవ్వుతున్నట్లన్పించింది.

పెట్టెలోని వాళ్లంతా నిశ్శబ్దంగా వింటున్నారు. ఈసారి సుశీల తన కొడుక్కు అయిదేళ్లు కాదని చెప్పలేకపోయింది. ఒక మనిషిని అవమానించడం ఎంత తేలిక! అనుకుంది నిస్సహాయంగా వింటూ. 'ఆ జేకబ్ ఏమి వాగినా అందరిలా నోరు మూసుకుని వుండక తగుదునమ్మా అంటూ వాదనకు దిగవలసింది కాదు!' అని తనను తానే తిట్టుకున్నది అసందర్భంగా.

చెప్పాల్సిందంతా చెప్పేసి టీ.సీ. వెళ్లిపోయాడు. కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది. పెట్టెలోనికి మొహం తిప్పలేకపోయింది సుశీల. 'టికెట్ లేని బైరాగుల కథ కంటే యింకా రసవత్తరంగా ప్రతీ ప్రయాణంలోనూ అందరికీ యీ కథ చెప్తాడు కాబోలు నల్లదొర! అందరి దృష్టిలోనూ ఎంత అపహాస్యం పాలైపోయాను!' అనుకుంటే కళ్లలో నీళ్లు తిరిగాయి. బలవంతాన ఏడుపు బిగబట్టుకుని కిటికీ దగ్గర్లో కిందికి చూస్తూ కూర్చుంది. బయట నేలా, చెట్లూ, కుప్పలూ, టెలిగ్రాఫ్ స్తంభాలూ straight lineలో వెనక్కు పరుగెడుతున్నవి. 'నా నీతిలాగా, నా పరువులాగా!' అనుకుంటూ కించపడ్డది సుశీల. నీ ఆలోచన ఎప్పుడూ ముక్కుసూటిగా straight lineలో నడుస్తుంది. జీవితం అలా వుండదు'

అన్నాడు భర్త ఓసారి మాటల్లో. నిజమే! జీవితం విచిత్రమైనదే. ఏ విషయమూ నిబ్బద్ధి కాపడం లేదు అనుకుంది కొత్త అనుభవం నేర్పిన కొత్తపాఠంతో.

ఆ పనికిమాలిన వాదన చెయ్యకుండా వుండి వుంటే! అనుకుంది పదిసార్లు. తగుదునమ్మా అని ఎంతగా మాట్లాడింది! అందరూ అబద్దాల గురివింద అని నవ్వుకుంటారన్న స్పృహ చాలా బాధ కలిగిస్తోంది.

ఒక్క నెల ముందు వాడికి మూడో ఏడు. ఇప్పుడు కాదు. నిజానికీ, అబద్ధానికీ తేడా యింతేనా? తేలిగ్గా వ్యవహారసరళి అనుకున్నానుగాని అబద్ధమని అనిపించనేలేదు!

ఇప్పుడు నిజం అన్నది అంత సూటి అయిన విషయంగా లేదు!... నేను అబద్ధం చెప్పడం ఏమిటి!... బెజవాడ దగ్గర టీ.సీ. చెప్పమంటేనే చెప్పాను గదా... ఆలోచనలు తీరూ, తెన్నూ లేకుండా పట్టు చిక్కకుండా పరుగెడుతున్నవి...

రైలు మాత్రం తన దోవన పరుగెడుతూనే వుంది. ఇంతవరకూ సావధానంగా విన్న మనుషులు ఒక్కసారిగా మాట్లాడటం ప్రారంభించారు. నిర్లిప్తంగా వింటూ కూర్చుంది సుశీల.

"డయాబెటీస్ తగ్గటమేమిటి? ఆరేళ్లు చదివిన వైద్యమంతా ఏం చేశావ్?" అన్నాడు పై బెర్త్ మీది సన్నటి డాక్టరు. రెండో డాక్టరు నవ్వాడు. "నేను డాక్టరు కాకముందు విషయం యిది. నాన్నగారిని ఒకరు కాదు యిద్దరు డాక్టర్లు రక్తంలో చక్కెరకు పరీక్ష చేసి డయాబెటిస్ అని తేల్చిచెప్పారట. డయట్‌లో శ్రద్ధ తీసుకుని నాలుగేళ్ల తర్వాత మళ్లీ చూపించుకుంటే జబ్బు లేదన్నారట.... తర్వాత ఆయన స్వీట్స్‌తో సహా అన్నీ స్వేచ్ఛగా తింటూ ఆరోగ్యంగా తొంభై ఎనిమిదేళ్లు బ్రతికారు. ఇటువంటి కేసుల గురించి వేరేవాళ్లు చెప్పటం కూడా విన్నాను" అన్నాడు.

"నాన్సెన్స్!... అంతా లూస్‌టాక్... అసలది డైబిటిస్ మెల్లిటస్ కాదేమో! అది ప్రోగ్రెసివ్ కండిషన్ అని తెలిసీ యీ మాటలు నమ్ముతావా!" అన్నాడు మొదటి డాక్టరు.

"జరిగిన విషయం అదీ... మనిషినిబట్టి శాస్త్రం రావాలా, శాస్త్ర ప్రకారం మనిషి వుండాలా? ఇంకొన్నాళ్లకు డయాబెటీస్ గురించి కొత్తవిషయాలు తెలిస్తే శాస్త్రం మారుతుంది. అంతా relative" రెండో డాక్టరు తన అభిప్రాయం చెప్పాడు తేలిగ్గా.

ఎదురు బెర్త్‌లో కూర్చున్నవాళ్లు ముగ్గురూ మళ్లీ వేదాంత చర్చ మొదలెట్టారు. "మా వూరి ఆశ్రమంలోని అమ్మగారు భావం నశించిన శుష్కమైన నియమ నిష్ఠల వలన ప్రయోజనం లేదన్నారు. మంత్రోపాసన యీ కాలధర్మంలో అనర్థాలకు దారి తీస్తున్నదన్నారు... ఇహ ముక్తి మార్గం ఏమిటమ్మా? అనడిగితే అంతా ఆ భగవంతుడే చూసుకుంటాడు అన్నారు" లావుకాలు మనిషి చెప్తున్నాడు.

తెల్లగా పొడుగ్గా వుండే మనిషి అసహనంగా, "ఏమిటయ్యా నీవనేది? సాధన ఏమీ చెయ్యకుండానే ముక్తి దొరుకుతుందనా? నియమ నిష్ఠలు పాటిస్తూ ఎన్నో జన్మల్లో సాధన చేసి పరోపకారాది సద్గుణాలు పొంది బ్రతుకే ఒక తపస్సుగా చేస్తే తప్ప భగవద్దర్శనం కాదు" అన్నాడు.

కాషాయ బట్టలతను వాదనలోకి దిగకుండా "నారాయణ... నారాయణ" అంటూ జపం ప్రారంభించాడు.

లావు కాలతను మాత్రం యింకా సందేహంగానే "నియమనిష్ఠల వల్ల అనుగ్రహం లభించి తీరుతుందంటారా? అప్పుడిహ అనుగ్రహం ఎక్కడున్నట్లు? నియమనిష్ఠలే దేవుడు!... అయినా భగవంతుడు సులభసాధ్యుడనీ, భక్తవత్సలుడనీ అంటారే! ఆయన తలచుకుంటే యీ నిష్ఠలు లేకుండా కూడా అనుగ్రహించడంటారా?" అన్నాడు.

అవతలి వ్యక్తి విసుగ్గా, "ఏమిటయ్యా నీ గొడవ? భగవంతుడు యిహ నుంచీ పద్ధతి మార్చుకుని అల్లాటప్పగాళ్లకే ప్రత్యక్షమౌతాడనేట్లున్నావ్!" అని కసురుకున్నాడు.

ఎక్కడా ఎవరికీ నిజం తాలూకు ఆచూకీ కనబడుతున్నట్లు లేదు! అనుకుంది సుశీల.

ఈ చివర్న కూర్చున్న స్టూడెంట్స్ ఎందుకో పెద్దగా నవ్వారు గొలగొలగా. "బారాహాల్ వెళ్లి దో ఆంఖోతో చూసి ఇనప గొలుసులు తెచ్చి కాళ్ల మీద వేసుకున్నాకనే వాళ్లకి నిద్దరొచ్చింది" అన్నాడొక అబ్బాయి.

అలవాట్ల మూసలో నుంచీనే ఎదగాలేమో మనిషి! అనుకుంది సుశీల. అప్పుడే సికిందరాబాద్ స్టేషన్ వచ్చేస్తున్నట్లుంది. రైలు పెట్టెలోని వాతావరణం మారిపోయింది. ఏదో గడబడ ప్రారంభమైంది. మనుషుల మాటతీరులో ఉత్సాహం, ధీమా వినబడుతున్నవి. తల త్రిప్పకుండా బయటికే చూస్తున్న సుశీల చెవుల్లోకి ఆ చురుకుదనం దూరి, ఆమె మనసులోని బరువును ప్రక్కకు నెట్టింది. నిజమూ, అబద్ధమూ, మతమూ దేవుడూ, వైద్యమూ స్వస్థతా, నీతీ అవినీతీ - అన్నీ మానవ వ్యవహారాలూ ఆ ఉషఃకాలపు మసకవెలుగుల్లో పునీతాలై నవజీవన కోలాహలంగా ఉద్భవించాయి. ఎటుచూసినా ఉత్సాహమే, జీవశక్తివిన్యాసమే-సందేహమే లేదు!

రైలు కూతలు పెడుతూ ముందుకు పరుగెడుతుంటే, చూపు మేర వైశాల్యంలో ఇళ్లూ, మేడలూ, కరెంటు స్తంభాలూ, చెట్లూ, నేలా - అన్నీ ఉదయకాంతిలో స్పష్టమైన ఆకారాలు ధరిస్తూ అల్లిబిల్లి తిరుగుతున్నవి. ప్రతి వస్తువూ ప్రత్యేకతను సంతరించుకుంటూ ప్రియంగా దృశ్యమానమౌతున్నది. 'జీవన వైచిత్రి ద్వంద్వ స్వరూపపు మనసుకు చిక్కే సామాన్య వ్యవహారం కాదు. అది ఊహాతీతమూ, స్పష్టమూ, బహు సుందరమూను!'

అనుకుంది సుశీల.

రైలాగింది. ప్లాట్‌ఫారం మీది నుండీ అత్తగారు ఆత్రంగా లోనికి చూచి "అదేమిటమ్మాయ్! ఇంకా హోల్డాలు కట్టలేదూ?... బాబులూ, లేచి కూర్చున్నావా" అంటూ హడావుడిపడుతూ దిగే గుంపును నెట్టుకుంటూ లోనికి వచ్చింది.

ఆప్యాయతతో కూడిన యీ పలకరింపుకు సుశీల పెద్దబరువు దిగినట్టు నిట్టూర్చింది. 'మనల్ని కావాలనుకునేవాళ్లు, మన మంచి కోరేవాళ్లు...' ఆత్మీయతను గుర్తించమంటూ భర్త అన్న మాటలు మనసులో మెదిలాయి.

తోటి ప్రయాణీకులందరూ సామాన్లు సర్దేసుకున్నారు. హడావుడిగా లేచి, కూలీల్ని పిలిచి సామాన్లు దింపమని పురమాయిస్తున్నారు. స్వస్థానాలు చేరాలన్న తొందర్లో వున్నారు. అభిప్రాయాలూ, వాదనలూ, ఆధిక్యాలూ అన్నీ జారిపోయాయి. ఎవరి ప్రత్యేకత వారిది. అందరూ మనుషులు. లావు కాలతను తాపీగా కాలి మీది నుంచీ మందపాటి దుప్పట్లని తీశాడు మడవటానికి. అది మామూలు కాలే! రెండు దుప్పట్లు మీదనుండటాన లావుగా కన్పించింది.

టాక్సీలో యింటికెళ్తుంటే అత్తగారు చెబుతోంది : "మనూరుకెళ్తే వుండబుద్ధి కాలేదమ్మాయ్! ఒక్కదాన్నే బిక్కుబిక్కుమంటూ... అందులో ఆ పాడునీళ్లు యిప్పుడు నా ఒంటికి పడటం లేదు. ఒహటే విరేచనాలు. తల్లక్రిందులైపోయాననుకో... ప్రొద్దుటే అబ్బాయి స్టేషనుకొస్తానని చెప్పి ఒహటే నిద్ర. వాడిని లేపటమెందుకని నేనే ఒచ్చేశాను..."

ఆ వూళ్లో విరేచనాలైన మాట అబద్ధం అయి వుంటుంది, స్టేషనుకు నేనే వెళ్తానులేరా అని కొడుకుతో చెప్పి వుండవచ్చు, ఆయన పెట్టుకున్న అలారం తీసేసి వుండొచ్చు, అనుకుంది సుశీల తలూపుతూ తేలిగ్గా.

★★★